ప్రజాశక్తి

శుక్రవారం 9 డిసెంబర్ 2022

5

శ్రీ సత్యసాయి

'ఒటిఎస్' పేదలకు వరం

లబ్ధిదారులకు రిజిస్టర్ డాక్యుమెంట్లు అందిస్తున్న కౌన్సిలర్లు

హిందూపురం : సొంతింటి కలను నెరవేర్చుకోవడంలో భాగంగా తీసుకున్న రుణాలను తీర్చలేక ఇబ్బంది పడుతున్న రుణగ్రస్తులకు ఒటిఎస్ పథకం వరం లాంటిదని కౌన్సిలర్లు అంజలి రమేష్‌రెడ్డి, రహమత్‌బి అన్నారు. గురువారం పట్టణంలోని 11, 12వ వార్డుల్లో ఒటిఎస్ పథకం ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులకు రుణ విముక్తి పత్రాలతోపాటు రిజిస్టర్ డాక్యుమెంట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, టిపిఆర్ఒ కిష్టప్ప, నోడల్ ఆఫీసర్ వరలక్ష్మి, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేగవంతంగా రీ సర్వే పనులు

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం కింద వేగంగా రీ సర్వే పనులు చేపడుతున్నామని సిసిఎల్ఎ ప్రత్యేక అధికారి సాయి ప్రసాద్‌కు కలెక్టర్ బసంత్ కుమార్ తెలియజేశారు. గురువారం నాడు విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుంచి భూ హక్కు భూ రక్ష, భూ హక్కు పత్రాల పంపిణీ ప్రక్రియ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ చేతన్, డిఆర్ఒ భాగ్యరేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ మిగిలినవి రీ సర్వే పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరి లోపు పూర్తి చేయాలన్నారు. సమస్యలు ఎదురైతే ప్రణాళిక బద్ధంగా పరిష్కరించుకుంటూ ప్రజలు సంతృప్తిగా ఉండే విధంగా కొనసాగాలన్నారు. భూ హక్కు భూ రక్ష హక్కు పత్రాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని, వారంలోగా 22 పత్రాలు పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. భూ సర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేస్తామని కలెక్టర్ ఆయనకు వివరించరు.

ఎంపిఎఫ్‌సి గోడౌన్లకు స్థల సేకరణ చేపడుతున్నాం

జిల్లాలో మూడవ దశలో మంజూరైన ఎంపిఎఫ్‌సి(మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) గోడౌన్లకు స్థల సేకరణ త్వరలోనే పూర్తి చేస్తామని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ అహ్మద్ బాబుకు కలెక్టర్ బసంత్ కుమార్ వివరించారు. విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తో పాటు డిసిఒ కృష్ణ నాయక్, పశు సంవర్ధక శాఖ వైద్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మూడవ దశ లో 109 గోడౌన్లు మంజూరు కాగా 22 గోడౌన్లకు స్థల సేకరణ జరిగిందన్నారు. జగనన్న పాల వెల్లువకు సంబంధించి ఇప్పటికే జిల్లాలో 23 గ్రామాలు పాల సేకరణ చేపడుతున్నామన్నారు. త్వరలో మరో 60 గ్రామాల్లో ప్రారంభిస్తామని అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

గెలుపు కోసం వెతుకులాట

◆ పాత'కాపు'ల్లో ఎవరు మేలంటూ అన్వేషణ

◆ నిఘా, సర్వే సంస్థల ద్వారా ఆరా

సార్వత్రిక ఎన్నికలకు ఇక ఏడాది మాత్రమే గడువు ఉంది. ముందస్తు వస్తే మరింత ముందుగా ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల కోసం అన్వేషణ మొదలు పెట్టాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. వీటిల్లో ఏ నియోజకవర్గంలో ఎవరికి పట్టుంది. ఎవరైతే బెస్ట్ అవుతారన్న దానిపై ఆయా పార్టీలు సీరియస్‌గా దృష్టి సారించాయి.



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలకు ఇంకా ఏడాది సమయం ఉండగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో గెలుపు అభ్యర్థుల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల్లో అన్వేషణ మొదలైంది. ఇప్పటికే అధికార వైసిపి వివిధ సర్వేల ద్వారా గెలిచే అభ్యర్థులను గుర్తించే పనిలో పడింది. అటు నిఘా వర్గాల ద్వారానూ, ఇటు సర్వే సంస్థల ద్వారానూ వెతుకులాట ప్రారంభించింది. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని క్షుణ్ణంగా పరిశీలించే పని చేపట్టింది. ఇందులో పాత కాపులెవరైనా మంచివారుగా ఉండి, వారి వారసులెవరైనా ఉన్నారా అనే అన్వేషణ మొదలు పెడుతున్నారు. పాత నాయకుల్లో మంచి పేరున్న వారు ఉంటే వారిని తెరపైకి తీసుకొస్తే ఎలాగుంటుందన్న పరిశీలనను అధికార వైసిపి చేస్తుండటం గమనార్హం. ఈ మేరకు అనంతపురం నగరంలో ఎన్.రామకృష్ణ, డి.నారాయణస్వామిల పేర్లు సైతం పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. వారి వారసుల కోసం అన్వేషణ సాగుతుండటం చర్చనీయాంశమైంది. ఇక సర్వే సంస్థలు సైతం ఆయా నియోజకవర్గాల్లో పట్టున్న వారిని పట్టుకునే పనిలో ఉన్నారు. ప్రతిపక్ష టిడిపి కూడా నియోజకవర్గాల్లో కొన్ని చోట్ల మార్పులు చేస్తామన్న సంకేతాలను ఇస్తోంది. కటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశమిస్తారన్న ప్రచారమూ సాగుతోంది. టిడిపి కూడా అవసరమైతే ఇతర పార్టీల్లోనున్న సీనియర్ నాయకులను తీసుకురావడంగానీ, వారి కుటుంబ సభ్యులను తీసుకురావడంగానీ చేయాలన్న ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. గతంలో కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా ఉంటున్న వారు కొంత మంది స్తబ్ధుగా ఉన్నారు. వారిని వచ్చే ఎన్నికల బరిలో నిలిపితే ఎలాగుంటుందన్న యోచన సాగుతోంది. ఈ అంశాలన్నింటిపైనా సర్వేలు సైతం చేయిస్తున్నారు. ఇలా ఎవరి ప్రయత్నాల్లో వారు తలమునకలై ఉన్నారు.

సమీక్షలు మొదలు

అభ్యర్థుల ఎంపికకు సంబంధించి నియోజకవర్గాల వారీగా సమీక్షలకు సైతం రెండు పార్టీలూ సిద్ధం అయ్యాయి. వైసిపి రాయలసీమ పార్టీ కన్వీనర్‌గానున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వరుసగా కార్యక్రమాలను జిల్లాలో చేపడుతున్నారు. ఇందులో పార్టీ పరిస్థితులను అంచనావేసి శ్రేణులను సన్నద్ధం చేసే పనిలో ఉన్నారు. టిడిపి ఇదేమి ఖర్మ పేరుతో ప్రజల్లోకి వెలుతోంది. పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పర్యటన కూడా ఉండే అవకాశముంది. ఈ సమయంలోనే పార్టీ పరిస్థితిని సమీక్షించే అవకాశాలూ ఉన్నాయి. ఏదిఏమైనా జిల్లాలో ఇప్పుడు రాజకీయ వేడి క్రమక్రమంగా పెరుగుతోంది. నాయకులు వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

వైభవంగా ఖాద్రీశుని తెప్పోత్సవం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం కౌలేపల్లి దేవరచెరువులో ప్రసిద్ధిగాంచిన ఖాద్రీ లక్ష్మినరసింహ స్వామి తెప్పోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఏటా డిసెంబర్‌లో ఖాద్రీశుడి తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా పూజలు నిర్వహించిన అనంతరం పట్టణంలో ఊరేగింపుగా చెరువు వద్దకు చేరుకుని తెప్పపై విహరించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై తెప్పోత్సవాన్ని వీక్షించారు. తెప్పోత్సవంలో పాల్గొన్నా ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఖాద్రీశుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గోపాలకృష్ణ, వాల్మీకి పవన్ కుమార్‌రెడ్డి, కార్యనిర్వాహణాధికారి పట్టెం గురుప్రసాద్, ఎంపిపి అమర్నాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, జడ్పిటిసి రాధాబాయి, సర్పంచి రూపా రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా అగ్రి బోర్డు మెంబర్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీ లోకేష్, ఆలయ కమిటీ సభ్యులు రవీంద్రారెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, శివకృష్ణకుమార్, లక్ష్మీనారాయణరెడ్డి, వేణుమాధవ్, శ్రీవారి భక్తులు పాల్గొన్నారు.

తెప్పోత్సవానికి ఎమ్మెల్యే సిద్ధారెడ్డికి స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు

మార్కెట్ ముందు వ్యాపారాలు చేస్తే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

నూతనంగా నిర్మాణం చేసిన కూరగాయల మార్కెట్ ముందు వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం పట్టణ వన్‌టౌన్ సిఐ ఇస్మాయిల్‌తో కలిసి కమిషనర్ మార్కెట్‌తో పాటు మార్కెట్ ముందు ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ ముందు తోపుడు బండ్లతో, మార్కెట్ ముందు వ్యాపారాలు చేసున్న వారు వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుని ఖాళీ చేయించాల్సి ఉంటుందన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పురపాలక శాఖ తరపున రూ.కోట్లు వెచ్చించి నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్, కూరగాయల మార్కెట్‌ను నిర్మించినట్లు తెలిపారు. వీటిని ఇప్పటికే బహిరంగ వేలం వేసి కేటాయించినట్లు తెలిపారు. పాటదారులు వారికి కేటాయించిన గదుల్లో మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలన్నారు.

మార్కెట్ ముందు వ్యాపారాలను పరిశీలిస్తున్న కమిషనర్, సిఐలు

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం : సిఐటియు

ప్రజాశక్తి-బుక్కపట్నం

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులను నిర్వీర్యం చేసే పనిలో పడిందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల బిల్లులు పెంచకుండా కాలయాపన చేస్తోందన్నారు. వెంటనే క్యూబిక్ మీటర్‌కు బిల్లులు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వలసలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ఈ సమావేవంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, గ్రామీణ ఉపాధి హామీ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పవన, కళాకారుల సంఘం సభ్యులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

విలేకరులతో మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

గోరంట్ల : రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలుగు యువత నాయకులు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాపు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా మారాయన్నారు. తద్వారా యువత పెడదారి పడుతోందన్నారు. రాష్ట్రంలో యువతీ, యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక చెడుదారి పడుతున్నారన్నారు. దీంతో డ్రగ్స్‌కు ఆకర్షితులు అవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని డ్రగ్స్ గంజాయి అమ్మకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి నరేష్‌యాదవ్, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శులు మంజునాథ్, రమేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నెమలిని అటవీ అధికారులకు అప్పగిస్తున్న జమేదార్ రవికాంత్

అటవీశాఖ అధికారులకు నెమలి అప్పగింత

తలుపుల : మండల పరిధిలోని పల్లవాండ్లపల్లి గ్రామ సమీపంలో మామిడి తోటలో పనిచేస్తుండగా నెమలి కనిపించడంతో పూల బజారు చెందిన బాబ్జాన్ తీసుకుని నేరుగా గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. జమేదార్ రవికాంత్ వెంటనే ఫారెస్ట్ అధికారులు తెలియజేసి బీట్ ఆఫీసర్ నరసింహమూర్తికి నెమలిని అప్పటించారు. నెమలికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అటవీ ప్రాంతంలోకి వదులుతామని అధికారులు తెలిపారు.



ఎంపిపి మజ్జిగ అంజలికి ప్రమాణ స్వీకార పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

బీసీలకు పెద్దపీట వేశాం..

పరిటాల కుటుంబానికి 'ఖర్మ'- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే బీసీలకు పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. చెన్నేకొత్తపల్లి ఎంపిపిగా మజ్జిగ అంజలి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ సిఎం అయ్యాక పార్టీలు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. ప్రతి ఇంటికీ కనీసం రూ.3లక్షలు లబ్ధి చేకూరేలా పాలన అందిస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో టిడిపి చేపట్టిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమానికి స్పందన లేకుండా పోయిందన్నారు. దీంతో జనం రాక 'ఇదేం ఖర్మ బాబూ..మాకు' అంటూ పరిటాల సునీత వారి కార్యకర్తలతో చెబుతోందని ఎద్దేవా చేశారు. 25 ఏళ్లుగా వారు చేసిన మోసాలను మరిచిపోయి తమకు ఓట్లు వేస్తారనుకుంటే ఓడించారని ప్రజల వద్ద వాపోతున్నారన్నారు. అయితే చేసేదిలేక పదో..20మందినో వెంట వేసుకుని నామమాత్రంగా గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. తాను మంత్రిగా గ్రామాల్లో ఏం చేశారో ముందు చెప్పి గ్రామాల్లో తిరగాలని పరిటాల సునీతకు సూచించారు. అయితే తాను ఎమ్మెల్యే అయిన మూడున్నరేళ్లలోనే నియోజకవర్గంలో అనేక మార్పులు తీసుకొచ్చానన్నారు. ఇందులో పేరూరు డ్యాంకు నీళ్లు రావడం, రామగిరి బంగారు గనులు తెరిపించే చర్యలు, ప్రతి చెరువుకూ నీళ్లవ్వడం, 26 వేల ఇళ్లను తీసుకొచ్చామని, తోపుదుర్తి మహిళా సహకార డెయిరీని ఏర్పాటు చేశామన్నారు. ఈ డెయిరీలో 10 వేలమందికి సభ్యత్వం ఇవ్వాలని సర్వేలు చేస్తే 20 వేలమంది ముందుకొచ్చారు. తన సొంత నిధులు దాదాపు రూ.15 కోట్ల ఆస్తిని నియోజకవర్గంలోని పాడి రైతు అక్కచెల్లెమ్మలకు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపిపిలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి మూడేళ్ల పాలనలో అభివృద్ధి

ప్రజాశక్తి-బత్తలపల్లి

రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వర్ణయుగం నడుస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రామాపురంలో గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అదే సమయంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటూ సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నివర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా దొరికిందన్నారు. ప్రజలంతా ఆర్థికంగా బలోపేతం అయ్యారన్నారు. సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి జయపరెడ్డి, నాయకులు కప్పల నారాయణస్వామి, నాగన్న, పెద్దప్పు, బండి వీరనారప్ప, సోమశేఖర్, పెదయ్య, బండి నాగభూషణ, ఆదినారాయణ, సూర్యనారాయణ, శ్రీనివాసులు, మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.



కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

బీసీల ద్రోహి సిఎం జగన్

టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ

బీసీల ద్రోహి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ ఉన్మాది పాలనలో రాష్ట్రం నాశనం అవుతోందన్నారు. కులాలు, ప్రాంతాల కుంపట్లో చలి కాసుకునే రకం సిఎం జగన్ అన్నారు. బిసిలు ఆర్థికంగా సమాజంలో నిలదొక్కుకుంది టిడిపి హయాంలోనే అన్నారు. టిడిపి హయాంలో 'ఆదరణ' పథకాన్ని తీసుకొచ్చి బీసీల్లోని కులవృత్తుల వారికి రూ.90 శాతం సబ్సిడీతో అధునాతన పనిముట్లను అందజేసిందని గుర్తు చేశారు. ఇందుకు చంద్రబాబు ప్రభుత్వం రూ.750 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అయితే జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదరణ పథకాన్ని నిలిపివేశారన్నారు. పరిపాలించడం చేతరాని వ్యక్తికి 54 మంది సలహాదారులా అని అని ప్రశ్నించారు. సలహాదారుల్లో ఏ ఒక్కరైనా బీసీ ఉన్నారా అని నిలదీశారు. బీసీల ఆస్తుల్ని దిగమింగి, బీసీలను బలితీసుకుంటున్న విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో బీసీల సభ నిర్వహించడమే జగన్ రెడ్డి బీసీలకు చేస్తున్న ద్రోహానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. దాదాపు రూ.30వేల కోట్ల బీసీ సంక్షేమ నిధులు మళ్లించిన జగన్‌ను బీసీలు క్షమించరన్నారు. అంతేగాకుండా వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 217 మత్స్యకారుల ఉనికికి గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. చెరువులు, కాలువలు, రిజర్వాయర్లపై పూర్తి హక్కులు మత్స్యకార సొసైటీలకు బదులు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తాయన్నారు. 12ఏళ్ల వైసిపి చరిత్రలో ఒక్కడంటే ఒక్క బీసీ నాయకుడిని ఎదగనివ్వలేదన్నారు. మండల వ్యవస్థను తీసుకొచ్చి, ప్రజలకు పాలన చేరువ చేయడం ద్వారా టిడిపి బీసీలను రాజకీయంగా ఎదిగేలా చేసిందన్నారు. 300 సమితులు, 1020 మండలాలుగా మార్చిన చరిత్ర టిడిపిదే అన్నారు. నవరత్నాల పేరుతో బీసీల్ని నట్టేట ముంచిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అలాగే గీత కార్మికుల పొట్ట కొట్టి తన కల్తీ మద్యాన్ని ప్రజల నెత్తిన రుద్ది ప్రాణాలు తీస్తున్నాడని ఆరోపించారు. తద్వారా తరతరాలుగా కల్లు వృత్తిపై ఆధారపడిన వారి పొట్ట కొట్టాడని ధ్వజమెత్తారు.

దళితుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మాదిగ ఉపకులాల ప్రజల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే నర్సింగ్‌హోంలో త్వరలో తాడేపల్లిలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర విస్తృతస్థాయి సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు రిజర్వేషన్ విభజన చట్టబద్ధత సాధనకు సిఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు నాగరాజు మాట్లాడుతూ మాదిగ ఉప కులాల షెడ్యూల్ కులాలకు చాలా సమస్యలు ఉన్నాయన్నారు. ఆయా సమస్యలు పరిష్కారం కావాలంటే షెడ్యూల్ కులాల రిజర్వేషన్ విభజన చట్టబద్ధత అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు అంజనప్ప, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, తాలూకా అధ్యక్షులు రామాంజనేయులు, ఉపాధ్యక్షులు అంజి, నాయకులు నరసింహమూర్తి, చందు, శివన్న, వెంకటరమణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ

హిందూపురం : పట్టణంలోని చైతన్య పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వన్‌టౌన్ సిఐ ఇస్మాయిల్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తలకు హెల్మెట్ ధరించి, రక్షణ పొందాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐ ఇస్మాయిల్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. దీంతో పాటు వాహనాలు నడిపే సమయంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పని సరిగా పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ ప్రకాష్‌రెడ్డి, ఎ ప్రభాకర్‌రెడ్డి, డీన్ నాగరాజు, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు శ్రీసత్యసాయి కళాశాల విద్యార్థి

పెనుకొండ : ఉరవకొండలో ఎస్‌కెయూ పరిధిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపిసి చదువుతున్న డి.మౌలాలి విశేష ప్రతిభ కనబరిచారన్నారు. దీంతో కళాశాల యాజమాన్యం, ఏఓ కేశవయ్య, అధ్యాపక బృందం విద్యార్థిని అభినందించారు.

ద్విచక్ర వాహనాలకు వేలంపాట

హిందూపురం : పట్టణంలోని 2వ పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన 18 ద్విచక్ర వాహనాలను గురువారం స్టేషన్ ఆవరణలో సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ వాహనాలకు రవాణా శాఖ అధికారులు రూ.2.23 లక్షలు ధర నిర్ణయించినట్లు తెలిపారు. వీటికి బహిరంగ వేలం వేయగా రూ.2.78లక్షలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో 18శాతం జిఎస్‌టిని కలిపితే రూ.3.28లక్షలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు సిఐ తెలిపారు. ఈ వేలంపాటలో సెబ్ సిఐ లక్ష్మిదుర్గయ్య, పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఓరియంటల్ పాఠశాల విద్యార్థులు

లేపాక్షి : మండల కేంద్రంలోని ఓరియంటల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివి.గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల స్థాయిలో జరిగిన ఖోఖో ఆటలో ఓటియంటల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు బాలాజీ, లిఖిత, వాలీబాల్‌లో ప్రణతి, అయేషా, త్రోబాల్ ఆటలో నితిన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. దీంతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది, పీడీ సురేష్‌బాబుకు అభినందనలు తెలిపారు.

ఓటు నమోదు చేసుకోండి

హిందూపురం : పట్టభద్రులు విధిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంకా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోని పట్టభద్రులు వెంటనే నమోదు చేసుకోవాలన్నారు.

ఓటరు నమోదుకు నేడు చివరి అవకాశం

బత్తలపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు పట్టభద్రులకు నేడు చివరి అవకాశమని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదుకు, దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం వరకు గడువుందన్నారు. కావున 2019 ఏడాది లోపు డిగ్రీ పూర్తి చేసుకున్నవారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కార్యకర్తకు పరామర్శ

బత్తలపల్లి : మాజీ ఎంపిటిసి పల్లపు కళావతి భర్త, వైసిపి నాయకులు వడ్డె క్రిష్టప్ప అనారోగ్యంతో బాధపడుతుండడంతో విషయం తెలుసుకున్న మండల వైసిపి కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఉప సర్పంచు కోటి గోపీనాథ్ మంగళవారం పరామర్శించారు. ఈమేరకు మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఉన్న క్రిష్టప్ప స్వగృహానికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విషయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాకప్ప, మాజీ జెడ్పీటీసీ అక్కిం నరసింహులు, నాయకులు సంద్రా రామకృష్ణ, బండి నాగభూషణ, ముసలప్ప, కుమ్మర వెంకటరమణ, హాసన్ తదితరులు ఉన్నారు.

క్రిష్టప్పను పరామర్శిస్తున్న వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి

రానున్న రోజుల్లో టిడిపిదే అధికారం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

రానున్న రోజుల్లో టిడిపిదే అధికారం అని మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని చందకచర్ల గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వైసిపి ప్రభుత్వం చేసిన అప్పులు, పాలన వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రంగాగౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు కన్నా, మాజీ సర్పంచి అంజి, ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అగళి : మండలంలోని ఇనగలూరు పంచాయతీ తొణసనపల్లి గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ తిప్పేస్వామి హాజరై ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, కన్వీనర్ కుమారస్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జి శివకుమార్, మాజీ ఎంపిపి నరసింహప్ప, మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్ శ్రీనివాస్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామి, నారాయణప్ప, రంగనాథ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరాపురం : మండల పరిధిలోని దేవగానపల్లిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందన్నారు. ప్రజలందరూ మన చంద్రన్న రావాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మండల కన్వీనర్ గణేష్, మాజీ మండల కన్వీనర్ శివరుద్రప్ప, మాజీ ఎంపిపి కృష్ణమూర్తి, మండల టిడిపి ఉపాధ్యక్షులు జయరాం, మాజీ ఎంపిటిసి చంద్రప్ప, నాయకులు నాగభూషణ, రవికుమార్, సిద్దేశ్వర, హనుమంతరాయ పాల్గొన్నారు.

కదిరిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

మడకశిరలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న తిప్పేస్వామి

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలు పట్టించుకోవడంలేదని టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులు, మండల అబ్జర్వర్ మోపురిశెట్టి చంద్రశేఖర్ విమర్శించారు. గురువారం కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి పంచాయతీలో మండల కన్వీనర్ చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎర్రదొడ్డి పంచాయతీలోని రాందాస్‌నాయక్ తండా, బోడే నాయక్ తండా, మీటే నాయక్‌తండా, తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు పర్వీన్‌భాను, క్లస్టర్ ఇన్‌ఛార్జి హరి, యూనిట్ ఇన్‌ఛార్జి కుపేందర్‌రెడ్డి, ఈశ్వర్‌నాయక్, రామకృష్ణానాయక్, మహేంద్రనాయక్, శ్రావణ్‌కుమార్ నాయక్, ఆంజనేయులు, ఫరూక్, సురేష్‌రెడ్డి, కుప్పాల ప్రసాద్, రోషన్, క్లస్టర్ కోఆర్డినేటర్ నాగేంద్ర, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే సబ్‌ప్లాన్ అమలు చేయాలి

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి నిధులు వెచ్చించాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి సవాల్ విసిరారు. గురువారం సాయంత్రం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బీసీలకు వెన్నుదన్నుగా నిలిచి రిజర్వేషన్ 33 శాతం కల్పిస్తే, నేడు వైసిపి ప్రభుత్వం రిజర్వేషన్ శాతాన్ని 23 శాతానికి తగ్గించి 16,500 మందికి పదవులు దక్కకుండా చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా బ్రిటీష్‌పాలన తలపించే విధంగా 'విభజించు పాలించు' సిద్ధాంతంతో ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. కులాలను విడదీసి 5 6 కార్పొరేషన్లను ఏర్పాటు చేశారే తప్ప వాటికి నిధులు మంజూరు చేసిన పాపానపోలేదన్నారు. టిడిపి ప్రభుత్వంలో బీసీలకు ఆదరణ పథకం ద్వారా పనిముట్లు ఇచ్చి ఆదుకుంటే, ఈ ప్రభుత్వంలో కనీసం డ్రిప్పు స్ప్రింక్లర్లు ఇవ్వకుండా రైతాంగాన్ని నష్టాల ఊబిలోకి నెట్టిందని దుయ్యబట్టారు. వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల్లో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని తూర్పారబట్టారు. విదేశీ విద్యను సైతం నీరుగార్చారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీల మీద మక్కువ ఉంటే బడ్జెట్‌లో సబ్‌ప్లాన్ ప్రకారం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నేత కళ్లుమరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి నరేష్ కన్నా, దాసిరెడ్డి ఈరన్న, భరత్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి

ఆత్మాభిమానంపై వైసిపి అగ్రవర్ణాల దాడి : సవితమ్మ

పెనుకొండ : బీసీల ఆత్మా భిమానంపై వైసిపి అగ్రవర్ణాలు దాడి చేస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఆరోపించారు. గురువారం పట్టణంలోని సవితమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిర్వహించిన జయహో బిసిలో చంద్రబాబును తిట్టడం తప్ప బిసిలకు ఏం చేశారో చెప్పలేదన్నారు. వైసిపిలో ఏ ఒక్క బీసీ మంత్రి, ఎమ్మెల్యే నేరుగా ముఖ్యమంత్రిని కలిసే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. 56 కార్పొరేషన్ ఏర్పాటు చేసామని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి నాయకులు వాటికి ఏ స్థాయిలో నిధులు కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్ పదవులు కేవలం అలంకారప్రాయంగా మాత్రమే ఉన్నాయన్నారు. టిడిపి బీసీ నేతలను రాజకీయంగా, ఆర్థికంగా అణచివేయడం, సొంత పార్టీ బీసీలను అవమానించడమే పనిగా జగన్ పరిపాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ఆంజనేయులు, అడదాకులపల్లి మాజీ సర్పంచి ప్రసాద్, త్రివేంద్రనాయుడు, వాసుదేవరెడ్డి, మబాషా, ఓబులేష్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

బిసిలకు ఏం చేశారో వైసిపి చెప్పాలి..

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో బీసీలకు ఏంచేశారని బీసీ సభ పెట్టారని టిడిపి బీసీ నాయకులు ప్రశ్నించారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టిడిపి హయాంలో దాదాపు బీసీల్లో ఉన్న 56 కులాలకు బీసీ కార్పొరేషన్ పెట్టి ఆదుకున్నామని గుర్తు చేశారు. అయితే సిఎం జగన్ మాత్రం పేరుకు 56 కార్పొరేషన్‌లో పెట్టారుగానీ, ఒక్క రూపాయి నిధులు విడుదల చేయలేదన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, పింఛన్లు వంటి పథకాల్లో బీసీలు లబ్ధి పొందుతున్నారని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. టిడిపి హయాంలో ఎవరైనా చనిపోతే బీమా వచ్చేదని, ఆఖరికి ఈ ప్రభుత్వంలో అదికూడా రాలదేన్నారు. అలాంటి వైసిపి నాయకులు బిసిల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పిట్ల సుధాకర్, బీసీ నాయకులు కంచి సురేష్, షాను, మండోజి ఆరీఫ్, నిజాం, అంజినప్ప, గంగాద్రి, శ్రీనివాసులు, నాగేంద్ర, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఉమ్మడి వనరులను కాపాడుకుందాం

గాండ్లపెంట : ఉమ్మడి వనరులను కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని ఎంఇఒ కృష్ణానాయక్ సూచించారు. గురువారం మండల పరిధిలోని మలమీదపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇఎస్ స్వచ్ఛత సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వనరులను కాపాడుకుంటే భవిష్యత్ తరాలు బాగుంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాచారచన పోటీలు నిర్వహించారు. తర్వాత పాఠశాల ఆవరణలో దాదాపు 90 రకాలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగాల రవీంద్రారెడ్డి, సర్పంచి కళావతి, వైస్‌ఎంపిపి భారతి, నాయకులు చలపతి, ప్రతాపరెడ్డి, పాఠశాల ఛైర్మన్ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవిపై అవగాహన

ప్రజాశక్తి-తలుపుల

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో కళాకారుల ద్వారా మండల కేంద్రంలో గురువారం నాటక రూపంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెచ్‌ఐవి గురించి వివరిస్తూ హెచ్‌ఐవి కేవలం 4 రకాలుగా మాత్రమే వస్తుందన్నారు. సురక్షితం కానీ లైంగిక సంబంధాల ద్వారా, కలుషిత సూదులు, సిరంజీల ద్వారా, కలుషిత రక్త మార్పిడి ద్వారా, హెచ్‌ఐవి సోకిన తల్లి నుంచి బిడ్డకు హెచ్‌ఐవి వచ్చే అవకాశం ఉందన్నారు. అయితే హెచ్‌ఐవి సోకిన గర్భిణుల నుంచి పుట్టబోయే బిడ్డలకు రాకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. ముఖ్యంగా యువతకు హెచ్‌ఐవిపై అవగాహన లేకపోవడం, సామాజిక మాధ్యమాలు, చెడు సావాసాల కారణంగా అధికంగా హెచ్‌ఐవి బారిన పడుతున్నారన్నారని నాటక రూపంలో వెంకటేష్ కళాబృందం వివరించింది. ఈ కార్యక్రమంలో జన జాగృతి సిబ్బంది, పిఇ సావిత్రి, ఓబులమ్మ పాల్గొన్నారు

కొండకమర్లలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు

సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

ఓబుళదేవరచెరువు : మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిని పుట్టపర్తి టిడిపి అభ్యర్థిగా అధినేత చంద్రబాబు ప్రకటించడం పట్ల ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం మండలంలోని కొండకమర్లలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాణాసంచి కాల్చి పార్టీ కార్యాలయంలో మిఠాయిలు పంచుకున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పుట్టపర్తి టిడిపి అభ్యర్థి విజయం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, డాక్టర్ జాకీర్‌అహ్మద్, బడిసం రామాంజి, షానవాజ్, షాను, కొండే ఈశ్వరయ్య, జయచంద్రారెడ్డి, సర్పంచి రేణుకాబాయి, బడిసం సురేష్, అంజినప్ప, రాజారెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంజిఎం విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

అండర్-17 స్కూల్స్ గేమ్స్ పోటీల్లో భాగంగా ఇటీవల ఎంజిఎం మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో పట్టణంలోని ఎంజిఎం పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో ఎంపికైన విద్యార్థులను గురువారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం సామ్రాజ్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. బాలికల విభాగంలో 10వ తరగతికి చెందిన మధు, అనూరాధ, లిఖిత, బాలుర విభాగంలో ఎస్.సైఫ్, సతీష్ ఎంపికైనట్లు తెలిపారు. వీరందరూ ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు కడప జిల్లా ఎర్రగుంట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అనంతపురం జట్టు తరుపున ప్రాతినిథ్యం వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీలు లోక్‌నాథ్, సురేష్, విలియమ్ శేఖర్, రాణి, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఓబుళదేవరచెరువు : సిఎం జగన్ పుట్టినరోజు వేడకల్లో భాగంగా దుద్దుకుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 21 నుంచి 23వ తేదీ వరకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి స్వగ్రామం నల్లమాడ మండలం నల్లసింగయ్యగారిపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైద్యశిబిరంలో కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్లు, కంటి అద్దాలు, మహిళలకు వైద్య పరీక్షలు, గుండె జబ్బు పరీక్షలు, దంత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పర్వీన్‌షామీర్, జడ్పిటిసి దామోదర్‌రెడ్డి, తంగేడుకుంట సర్పంచి అబిదారఫిక్, మండల అగ్రి అడ్వైజరీ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి, ఓడిసి టౌన్ కన్వీనర్ కృష్ణారెడ్డి, నల్లమాడ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

ఆర్థిక ప్రణాళిక సమీక్షలో నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-బుక్కపట్నం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని డిఎల్‌ఒ శివారెడ్డి, ఎంపిపి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులకు, ఎంపిటిసి, అధికారులు, సచివాలయ సిబ్బందికి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ప్రతినిధులు కీలక పాత్ర పోషించి అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. అప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి శ్రీలత గోవర్ధన్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి ఇందిరాబాల, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు..

చిలమత్తూరు : 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీలను ఎలా అభివృద్ధి చేసుకోవాలనే అంశంపై గురువారం మండల అభివద్ధి కార్యాలయంలో మండలంలోని సర్పంచిలు, అధికారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా గత కొద్దిరోజుల క్రితం పెనుకొండలో శిక్షణ తీసుకున్న ఎంపిడిఒ రామ్‌కుమార్ పంచాయతీల అభివృద్ధిపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఈడిగ తిరుమలేష్, సంధ్య, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ అంజినప్ప, ఎంపిపి తాతం జగన్‌మోహన్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి మండల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గంగోజమ్మ, పంచాయతీ కార్యదర్శులు బాషా, రఫీ, శంకర్‌నాయుడు, సర్పంచులు శివప్పనాయుడు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు

బత్తలపల్లి : గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎంపిపి గుర్రం వనజ అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2023-24 సంవత్సరానికి అన్ని పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలు ఏవిధంగా తయారు చేయాలనే విషయంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధుల్ని శుభ్రంగా ఉంచడం, ఖాళీ ప్రదేశాలలో పచ్చదనం పెంపొందించడం, ఆహ్లాదకర వాతావరణం ఏర్పరచడం లాంటివి తయారు చేసేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడి సాయి మనోహర్, వైస్ ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, వైఎస్‌ఆర్ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, ఏపేట ఆదెప్ప, ఓబిరెడ్డి, ఎంఇఒ చాముండేశ్వరి, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు, ఎఎన్‌ఎంలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చిలమత్తూరు శిక్షణలో పాల్గొన్న కార్యదర్శులు, సిబ్బంది, సర్పంచిలు

లేపాక్షి : మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో గురువారం 2023-24ఆర్థిక సంవత్సరంలో పంచాయతీల్లో చేయాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహానాయుడు, ఇఒఆర్‌డి శివన్న, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ రాధిక, ఎంఇఒ నాగరాజునాయక్, వైద్యాధికారి చిరంజీవి, సర్పంచులు ఆదినారాయణ, నాగేంద్ర, రామచంద్రారెడ్డి, వైసిపి మండలం కన్వీనర్ నారాయణస్వామి, సచివాలయ కార్యదర్శులు లక్ష్మయ్య, ఆనంద్‌కుమార్, రమేష్, నాగేంద్రబాబు, శివభాస్కర్, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మృతి చెందిన భాగ్యమ్మ

హిందూపురం : పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీ వద్ద ఓ ద్విచక్ర వాహనం పందిని ఢీకొని కింద పడటంతో మహిళ మృతిచెందింది. మరొకరు తీవ్రగాయాలుపాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వీవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ముత్యాలప్ప తన భార్య భాగ్యమ్మ (38)ను వైద్య పరీక్షల నిమిత్తం పుట్టపర్తికి తీసుకెళ్తుండగా వీవర్స్ కాలనీలో ఒక్కసారిగా పంది అడ్డు వచ్చింది. దీంతో అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో భాగ్యమ్మ తలకు, ముత్యలప్ప భుజానికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు జిల్లా అసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు భాగ్యమ్మ పరిస్థితి విషమంగా ఉందని వెంటనే బెంగళూరుకు తరలించారు. బెంగళూరుకు వెళుతున్నంగా అప్పలతకుంట వద్ద మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మృతిచెందిన లక్ష్మి

అమరాపురం : మండలంలో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని గౌడన్నకుంట గ్రామానికి చెందిన రామకృష్ణ భార్య లక్ష్మి (31) సంతానం కలగలేదని మనస్థాపనతో ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం మడకశిర ఆసుపత్రికి తరలించారు.

చిత్రావతి నది దాటుతూ వ్యక్తి గల్లంతు

పుట్టపర్తి అర్బన్ : చిత్రావతి నది అవతల ఉన్న పొలంలోకి వెళ్లాలని వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని చెరుకూరి నాగేంద్ర (70) సాయి నగర్ సమీపంలోని చిత్రావతి నది అవతల ఉన్న పొలం వైపు ఉదయం 10 గంటలకు వెళ్లాడు. నది మధ్యలో పైపులు దాటుతూ నదిలోకి జారి పడ్డాడా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అక్కడ చెప్పులు విడిచాడు. సాయంత్రం వరకు అతని జాడ దొరకలేదని బంధువులు తెలిపారు. నదిలో పడ్డాడా.. లేక మరేదైనా జరిగిందా.. అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు, జాలర్లు నదిలో గాలిస్తున్నారు.

హత్య కేసు ఛేదింపు

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సిఐ జయనాయక్

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఈనెల 4న జరిగిన మహిళ హత్య కేసును పుట్టపర్తి రూరల్ పోలీసులు ఛేదించారు. ఈమేరకు గురువారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ జయనాయక్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈనెల 4న గొర్రెల కాపరి కేశప్ప భార్య నాగమ్మ హత్యకు గురికాగా కుమారుని ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన నారాయణస్వామి కుమారుడు బోయ హరి అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. గొర్రెలు మేపడానికి వెళ్లిన నాగమ్మను గమనించిన హరి ఎవరు లేని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి హత్యాచారం చేశాడు. అయితే విషయం గ్రామంలో చెబుతుందని భావించిన హరి బండరాయి, కర్రతో తలపై మోదడంతో అక్కడికక్కడే మృతిచెందింది. వెంటనే శవాన్ని పక్కనే ఉన్న చిన్న బావిలో పడేసి రక్తపు మరకలు గుర్తు పట్టకుండా మట్టిని కప్పివేసి వెళ్లాడు. ఈనేపథ్యంలో గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకుని హత్యకు వాడిన బండరాయి, కట్టెను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పుట్టపర్తి రూరల్ ఎస్సై బాబ్జాన్, కొత్తచెరువు ఎస్ఐ లింగన్న, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

'పొలంబడి'తో రైతులకు ఉపయోగం

రైతులతో మాట్లాడుతున్న ఎఒ సుమతి

నల్లమాడ : రైతు భరోసా కేంద్రాల పరిధిలో నిర్వహించే వైఎస్‌ఆర్ పొలంబడి కార్యక్రమం రైతులకు ఎంతో ప్రయోజనమని ఎఒ సుమతి సూచించారు. గురువారం మండల పరిధిలోని కురుమల గ్రామ సమీపంలో ఉన్న రైతు భాను ప్రకాష్‌రెడ్డి పొలంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం ఏవో మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమం ద్వారా పంటలకు సంభవించే తెగుళ్ల, నివారణ ఉపాయాల గురించి తెలుసుకోవచ్చన్నారు. ఇందులో భాగంగా పురుగు మందుల విష ప్రభావాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కురుమల రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యాధికారులు

పుట్టపర్తి రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి నాగరాజు నాయక్, 104 డాక్టర్ మురళీ సూచించారు. గురువారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కప్పలబండ గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలు, గర్భవతులు, బాలింతలు, ఎన్నిడి సిడి, పాఠశాల, అంగన్వాడీ, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. 104 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలన్నారు. కావున డ్రైడే ఫ్రైడే పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పోషక ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, హెచ్‌పి అపర్ణ, ఆరోగ్య కార్యకర్త ప్రమీల, ఆశాకార్యకర్తలు లక్ష్మీదేవి, జ్యోతి, 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో రైతులకు ఉపయోగపడే పనులు

బత్తలపల్లి : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఎంపిపి గుర్రం వనజ ఉపాధి సూచించారు. ఈమేరకు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఉపాధి కూలీలకు టార్పాలిన్‌లు, మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పథకం కింద కూలీలతోపాటు రైతులకు ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సాయి మనోహర్, ఎపిఒ ఆదెప్ప, వైస్ ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు, రాంభూపాల్‌రెడ్డి, రాజవీరారెడ్డి, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.